తెలంగాణ TELANGANA MUCHATLU
# ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | గురువారం - 14 - మే - 2026 | సంపుటి : 3 | సంచిక : 346 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## పార్కింగ్ సమస్యపై సీఎం దృష్టి

- ఉబర్ ప్రతినిధులతో రేవంత్ సమావేశం
- మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాలపై సూచనలు
- ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులకు ఆసక్తి



**హైదరాబాద్, మే 13 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రధాన నగరాల్లో రోజురోజుకు తీవ్రమవుతున్న పార్కింగ్ సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఉబర్ సంస్థ ప్రతినిధులకు సూచించారు. అవకాశం ఉంటే మల్టీ లెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. జూబ్లీ హిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఉబర్ సంస్థ ప్రధాన కార్యనిర్వాహణ అధికారి దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని కలిసి పలు అంశాలపై చర్చించింది. ఈ సందర్భంగా ఉబర్ సంస్థ కార్యకలాపాలు, హైదరాబాద్‌లో విస్తరణ ప్రణాళికలను ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి ఉబర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హైదరాబాద్‌లోనే ఉందని దారా ఖోస్రో షాహి తెలిపారు. ప్రస్తుతం అక్కడ 600 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నారని వెల్లడించారు. భవిష్యత్తులో కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు భారత్ ఫ్యూచర్ సిటీలో కార్పొరేట్ కార్యాలయం నిర్మించేందుకు ఆసక్తి ఉన్నట్లు తెలిపారు. ఈ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం అవసరమని కోరారు.

దేశంలోని ప్రధాన నగరాల్లో పార్కింగ్ సమస్య తీవ్రమవుతోందని ముఖ్యమంత్రి సమావేశంలో ప్రస్తావించారు. భవిష్యత్తులో వాహనాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే ఆధునిక పార్కింగ్ విధానాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా మెట్రో స్టేషన్లు, వాణిజ్య కేంద్రాల వద్ద సరైన పార్కింగ్ సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాలతో పాటు ఈవీ ఛార్జింగ్ సెంటర్లను కూడా ఏర్పాటు చేయాలని ఉబర్ ప్రతినిధులకు సూచించారు. ముఖ్యమంత్రి చేసిన సూచనలపై సమగ్ర అధ్యయనం చేస్తామని ఉబర్ ప్రతినిధి బృందం తెలిపింది. నగర రవాణా వ్యవస్థను ఆధునీకరించడంలో భాగంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని

మిగతా 2లో..

## పోక్సో కేసులో భగీరథ్ ట్విస్ట్

### విచారణకు గైర్హాజరైన బండి భగీరథ్
### రెండు రోజుల గడువు కోరిన లేఖ
### హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్



**హైదరాబాద్, మే 13 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ తనపై నమోదైన పోక్సో కేసుకు సంబంధించి బుధవారం పోలీసుల విచారణకు హాజరుకాలేదు. వ్యక్తిగత కారణాల వల్ల తాను హాజరుకాలేకపోతున్నానని, విచారణకు అందుబాటులోకి రావడానికి రెండు రోజుల గడువు కావాలని పోలీసులకు లేఖ రాశారు. ఈ మేరకు పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు మెయిల్ పంపించారు. మే 8న మైనర్ బాలికపై లైంగిక దాడికి

మిగతా 2లో..

## మోదీ, రేవంత్‌పై కవిత విమర్శలు

- పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా కోరిన కవిత
- బండి సంజయ్ కుమారుడిపై లుక్ అవుట్ నోటీసులు డిమాండ్
- నీటి నిర్వహణపై ప్రత్యేక కమిషన్ హామీ



**హైదరాబాద్, మే 13 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు పొదుపు సూత్రాలు చెబుతూ ఆంధ్రప్రదేశ్‌కు మాత్రం భారీగా నిధులు

మిగతా 2లో..

## రైతులకు భారీ పరిహారం భరోసా

- అసైన్డ్ భూముల రైతులకు కూడా వర్తింపు
- భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశాలు
- లింక్ కెనాల్ పనులపై సమీక్ష



**కొల్లాపూర్, మే 13 (తెలంగాణ ముచ్చట్లు):** కొల్లాపూర్ నియోజకవర్గంలోని బొల్లారం గ్రామ రైతు వేదికలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సంగినేనిపల్లి, తూముకుంట, బొల్లారం గ్రామాల రైతులతో సమావేశమయ్యారు. భూసేకరణ, పరిహారం, సాగు భూముల సమస్యలపై రైతులతో నేరుగా మాట్లాడి వారి అభ్యర్థనలు, ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అసైన్డ్ భూములు సాగు చేస్తున్న రైతులకు కూడా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువ రూ.1,87,500ను రెట్టింపు చేసి రూ.3,75,000గా నిర్ణయించాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. ఈ మార్కెట్ విలువ ఆధారంగా మూడింతల పరిహారం చెల్లించడంతో పాటు గెజిట్ ప్రచురించిన తేదీ నుంచి వడ్డీ కలిపి మొత్తం రూ.11.50 లక్షల వరకు పరిహారం అందించాలని స్పష్టం చేశారు. రైతులకు పరిహారం చెల్లింపులో ఆలస్యం జరగకుండా వెంటనే అవార్డు కాపీలు మంజూరు చేసి భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేశారు.

సింగోటం-గోపాల్ దిన్నె లింక్ కెనాల్ పనులను వేగవంతం చేయాలని కూడా మంత్రి స్పష్టం చేశారు. ప్రాజెక్టు పనులు త్వరగా ప్రారంభమయ్యేలా భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు నష్టపరిహారం అందిన తర్వాతే పనులు చేపట్టేలా సమన్వయం చేసుకోవాలని

మిగతా 2లో..




తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పార్కింగ్ సమస్యపై సీఎం దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

వినియోగించేందుకు సంస్థ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తులో హైదరాబాద్‌ను ఆధునిక అర్బన్ మొబిలిటీ కేంద్రంగా తీర్చి దిద్దే కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని ఆసక్తి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు వివరాలను ఉబర్ ప్రతినిధులకు వివరించారు. సుమారు 30 వేల ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ నగరం ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో ప్రత్యేకంగా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 500 కంపెనీలను ఈ ఫ్యూచర్ సిటీకి ఆహ్వానిస్తున్నామని, ఇప్పటికే అనేక సంస్థలు పెట్టుబడులకు ముందుకు వచ్చాయని వెల్లడించారు. శంషాబాద్ విమానాశ్రయానికి కేవలం 25 కిలోమీటర్ల దూరంలో ఉండటం ఈ ప్రాజెక్టుకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని పేర్కొన్నారు. గత డిసెంబరులో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో వందకు పైగా సంస్థలు పాల్గొని పెట్టుబడులపై ఆసక్తి చూపినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ కార్యాలయం నిర్మాణానికి దారా ఖోస్రోషాహి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఈ సమావేశంలో ఉబర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబర్ ఇండియా-సౌత్ ఆసియా అధ్యక్షుడు ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో భగీరథ్ ట్విస్ట్

(మొదటి పేజీ తరువాయి)

పాల్పడ్డాడన్న ఆరోపణలతో భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఈ కేసులో భాగంగా బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులు జారీ చేశారు. అయితే తక్కువ సమయంలో నోటీసులు అందాయని, తనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి ఆధారాలు, సమాచారం సేకరించేందుకు సమయం కావాలని భగీరథ్ తన లేఖలో పేర్కొన్నారు. దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తానని భగీరథ్ స్పష్టం చేసినట్లు సమాచారం. విచారణకు హాజరయ్యేందుకు మరో తేదీని సూచించాలని పోలీసులను కోరారు. ప్రస్తుతం ఈ వ్యవహారం రాజకీయంగా కూడా చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ఈ కేసులో పోలీసులు కఠినమైన పోక్సో చట్టంలోని సెక్షన్ 5(ఎల్), 6లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఈ సెక్షన్ల కింద నేరం రుజువైతే 20 ఏళ్లకు పైగా జైలు శిక్ష పడే అవకాశం ఉందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. కేసు దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు.

ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు డీసీపీ రితిరాజ్ పర్యవేక్షణలో విచారణ కొనసాగుతోంది. బాధితురాలి వాంగ్మూలం, సాంకేతిక ఆధారాలు, ఇతర సాక్ష్యాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఇదిలా ఉండగా భగీరథ్ ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరగనుంది. మరోవైపు తమపై తప్పుడు కేసు పెట్టి రూ.5 కోట్లు డిమాండ్ చేశారని ఆరోపిస్తూ బాధితురాలి కుటుంబంపై భగీరథ్ కరీంనగర్‌లో ఫిర్యాదు చేసిన విషయం కూడా ప్రాధాన్యత సంతరించుకుంది.

# మోదీ, రేవంత్‌పై కవిత విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తున్నారని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదాపై ప్రధాని ఒక్క మాట కూడా మాట్లాడలేదని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టు కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలుమార్లు కేంద్రాన్ని కలుస్తున్నారని, కానీ తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి మాత్రం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పట్టించుకోవడం లేదని విమర్శించారు. "మీ గురువును చూసైనా నేర్చుకోండి. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం ప్రధానికి లేఖ రాయండి" అంటూ రేవంత్ రెడ్డికి సూచించారు. రాష్ట్రానికి నీటి హక్కులు సాధించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

తెలంగాణ ఏర్పడింది నీళ్ల కోసమేనని గుర్తుచేసిన కవిత, గోదావరి, కృష్ణా నదుల్లో రాష్ట్రానికి ఉన్న వాటాను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నామని అన్నారు. గోదావరిలో 964 టీఎంసీలు వినియోగించే అవకాశం ఉన్నప్పటికీ కేవలం 220 టీఎంసీలు మాత్రమే వాడుకున్నామని తెలిపారు. కృష్ణా జలాల్లో కూడా రాష్ట్రం తన వాటాను పూర్తిగా వినియోగించుకోవడం లేదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే




సాగుయోగ్యమైన ప్రతి గుంటకు నీళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. నీటి నిర్వహణ కోసం ప్రత్యేకంగా వాటర్ కమిషన్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడిపై వచ్చిన ఆరోపణలను కూడా కవిత ప్రస్తావించారు. బండి సంజయ్ కుమారుడు దేశం విడిచి వెళ్లకుండా వెంటనే లుక్ అవుట్ నోటీసులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు తీవ్రమైనవని, పారదర్శక విచారణ జరగాలంటే ఈ చర్యలు అవసరమని పేర్కొన్నారు. బాధితురాలి ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో బయటకు రావడం దురదృష్టకరమని, వాటిని ప్రచారం చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మైనర్ బాలికలకు సంబంధించిన అంశాల్లో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని కవిత పేర్కొన్నారు. సమాజం ఆడపిల్లలను సులభంగా క్షమించదని, అందువల్ల బాధితురాలి గోప్యత కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కొన్ని పార్టీలు కేవలం సామాజిక మాధ్యమాల్లో ట్వీట్లు పెట్టి సమస్య పరిష్కరించినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. తాము ఎల్లప్పుడూ ఆడపిల్లల పక్షానే ఉంటామని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లు, మహిళా బిల్లు, జనగణన అంశాలపై కూడా కవిత స్పందించారు. మహిళా బిల్లులో ఓబీసీ ఉపకోటా తప్పనిసరిగా ఉండాలని డిమాండ్ చేశారు. జనగణనలో కులం, ఉపకులం, సామాజిక స్థితిగతులను నమోదు చేయాలని కోరారు. బీసీలకు రాజకీయాలు, విద్య, ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని వెల్లడించారు. బీసీ రిజర్వేషన్ల కోసం చేపట్టిన పోరాటంలో భాగంగా కోర్టుకు కూడా వెళ్తున్నామని తెలిపారు. తెలంగాణలో రాజకీయ శూన్యతను ప్రశ్నించేందుకు తెలంగాణ రక్షణ సేన ఏర్పడిందని కవిత పేర్కొన్నారు. ఈ నెల 20 నుంచి వచ్చే నెల 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా "జెండా పండుగ" నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పార్టీ నిర్మాణానికి ఇది పునాదిగా నిలుస్తుందని, ఈ కార్యక్రమాల ద్వారా నాయకత్వ బాధ్యతలు కూడా అప్పగిస్తామని తెలిపారు. రాష్ట్రంలో నీటి నిర్వహణ, రైతుల సంక్షేమం, సామాజిక న్యాయం అంశాలపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# మహబూబాబాద్ గ్రంథాలయ సంస్థకు కొత్త చైర్మన్

- వెన్నం శ్రీకాంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం
- అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్ష
- ప్రముఖుల శుభాకాంక్షలు వెల్లువ

**మహబూబాబాద్, మే 13 (తెలంగాణ ముచ్చట్లు):** మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా వెన్నం శ్రీకాంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి దనసరి సీతక్క హాజరై నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా గ్రంథాలయాల అభివృద్ధికి సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వేమ్ నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు. నూతన చైర్మన్‌కు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. గ్రంథాలయాలు విద్యా వికాసానికి కేంద్రబిందువులుగా నిలుస్తాయని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల యువతకు విజ్ఞానాన్ని చేరవేసే ప్రధాన వేదికలుగా గ్రంథాలయాలు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ఆధునిక



సదుపాయాలతో జిల్లా గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తే విద్యార్థులకు మరింత ఉపయోగకరంగా మారుతాయని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం డిజిటల్ యుగంలో కూడా పుస్తకాల ప్రాముఖ్యత తగ్గలేదని, గ్రంథాలయాలను సాంకేతికంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని నాయకులు సూచించారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాలని కోరారు. పాఠకుల సంఖ్య పెరిగేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. వెన్నం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాల్లో మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు పాఠకులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. విద్యార్థులు, యువత, పుస్తక ప్రేమికులకు ఉపయోగపడే విధంగా కొత్త కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో గ్రంథాలయ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అధికారులు తెలిపారు. కొత్త చైర్మన్ బాధ్యతలు స్వీకరించడంతో జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# రైతులకు భారీ పరిహారం భరోసా




(మొదటి పేజీ తరువాయి)

సూచించారు.

ప్రాజెక్టు పూర్తయితే సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. అసైన్డ్ పట్టాలు కలిగి ఉన్న రైతులకు కూడా సాధారణ పట్టాదారుల మాదిరిగానే పూర్తి పరిహారం చెల్లించాలని మంత్రి ఆదేశించారు. ఈ విషయాన్ని బొల్లారం సర్పంచ్ సుదర్శన్ రెడ్డి మంత్రి దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన జూపల్లి కృష్ణారావు అసైన్డ్ రైతులకు ఎటువంటి అన్యాయం జరగకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి ప్రతి అర్హుడికి న్యాయం చేస్తుందని తెలిపారు.

అలాగే అసైన్డ్ భూములు సాగు చేసుకుంటూ పట్టాలు లేని రైతులకు కూడా భూ సేకరణ చట్టంలోని 3ఆర్ నిబంధన ప్రకారం పూర్తి పరిహారం చెల్లించాలని మంత్రి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. భూములు సాగు చేస్తున్న ప్రతి రైతు కష్టాన్ని గుర్తించి పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. భూసేకరణలో పారదర్శకత పాటిస్తూ రైతులకు నష్టం కలగకుండా చూడాలని సూచించారు. రైతుల సమస్యలను ప్రత్యక్షంగా విని వెంటనే నిర్ణయాలు తీసుకోవడంతో స్థానిక రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. పరిహారం పెంపు, అసైన్డ్ రైతులకు కూడా వర్తింపజేయడం వంటి నిర్ణయాలు తమకు ఊరటనిస్తున్నాయని రైతులు పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే వ్యవసాయ రంగానికి మరింత మేలు జరుగుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# 45 ఏళ్ల తర్వాత ఇంటర్ పరీక్ష



- పరీక్ష రాసిన మాజీ మావోయిస్టు నేత
- కోరుట్లలో తెలుగు పరీక్షకు హాజరు
- న్యాయవాది కావాలన్న దేవ్‌జీ లక్ష్యం

**జగిత్యాల, మే 13 (తెలంగాణ ముచ్చట్లు):** మాజీ మావోయిస్టు అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ 45 ఏళ్ల తర్వాత మళ్లీ విద్యార్థిగా మారారు. బుధవారం జగిత్యాల జిల్లా కోరుట్లలో ఇంటర్మీడియట్ పరీక్షకు హాజరయ్యారు. ఆయన పరీక్ష రాయడం స్థానికంగా ఆసక్తికర చర్చకు దారితీసింది. దేవ్‌జీ 1980-82 కాలంలో కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ గ్రూప్‌లో ఇంటర్మీడియట్ చదివారు. ఆ సమయంలో విద్యార్థి రాడికల్ యూనియన్‌లో పనిచేస్తూ రెండో సంవత్సరం తెలుగు పరీక్షను బహిష్కరించారు. దీంతో ఆ సబ్జెక్టులో ఫెయిల్ అయ్యారు. అనంతరం ఆయన మావోయిస్టు ఉద్యమంలో చేరి అడవిబాట పట్టారు.

ఈ ఏడాది ఫిబ్రవరిలో మావోయిస్టు ఉద్యమాన్ని వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చిన దేవ్‌జీ, విద్యను పూర్తి చేయాలని నిర్ణయించుకున్నారు. ఇంటర్ బోర్డు ప్రత్యేక అనుమతితో మళ్లీ పరీక్ష రాసే అవకాశం లభించింది. గత కొద్ది రోజులుగా పరీక్ష కోసం ప్రత్యేకంగా సిద్ధమయ్యారని తెలిసింది. బుధవారం కోరుట్లలోని మ్యాస్ట్రో జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రానికి చేరుకున్న దేవ్‌జీ తెలుగు పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష అనంతరం మాట్లాడుతూ విద్య జీవితాన్ని మార్చగల శక్తి అని పేర్కొన్నారు. చదువు పూర్తి చేసి సమాజానికి ఉపయోగపడే దిశగా పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

భవిష్యత్తులో న్యాయవాద కోర్సు చదివి పేద ప్రజల కోసం పనిచేయాలన్నదే తన లక్ష్యమని దేవ్‌జీ వెల్లడించారు. చట్టపరమైన అవగాహన ద్వారా సామాన్య ప్రజలకు న్యాయం అందించాలనుకుంటున్నట్లు చెప్పారు. జీవితంలో ఎప్పుడైనా మార్పు సాధ్యమేనని యువతకు సందేశం ఇచ్చారు. దేవ్‌జీ పరీక్ష రాయడం స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఒకప్పుడు ఉద్యమ బాట పట్టిన వ్యక్తి మళ్లీ విద్యాభ్యాసం వైపు అడుగులు వేయడం పలువురిని ఆలోచింపజేస్తోంది. ఆయన నిర్ణయాన్ని పలువురు అభినందిస్తున్నారు.



## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి

**భీమదేవరపల్లి,మే13(తెలంగాణ ముచ్చట్లు):** భీమదేవరపల్లి మండల కేంద్రం లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అదనపు తరగతి గదులు, ఇతర అభివృద్ధి పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ రవి, డీఈవో గిరిరాజ్ గౌడ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, భీమదేవరపల్లి సర్పంచ్ మాచర్ల కుమార్,ముల్కనూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, వార్డు సభ్యులు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు పేర్కొన్నారు.



## తల్లాడ మండలం బస్వపూర్ క్రాస్ రోడ్ లో వాహనాల తనిఖీలు

**ఖమ్మం బ్యూరో, మే 13(తెలంగాణ ముచ్చట్లు ):** బక్రీద్ పండుగ నేపథ్యంలో అక్రమ రవాణాను అరికట్టేందుకు తల్లాడ మండలం బస్వపూర్ క్రాస్ రోడ్ లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న వైరా సిఐ వెంకటప్రసాద్... తల్లాడ ఎస్సై...పశువుల అక్రమ రవాణాపై 24/7 నిఘా ఉంటుందన్నారు.పశువులను తరలించేటప్పుడు సరైన ధృవీకరణ పత్రాలు కలిగి ఉండటం తప్పనిసరన్నారు.




## సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు

### ఎస్సై బోనకల్ పొదిలి వెంకన్న

**ఖమ్మం బ్యూరో, మే 13(తెలంగాణ ముచ్చట్లు ):**రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకొని శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సరిహద్దుల్లో పాలడుగు క్రాస్ రోడ్డు చెక్ పోస్టులో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు బోనకల్ ఎస్సై వెంకన్న తెలిపారు. ముఖ్యంగా అక్రమ పశు రవాణాకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా తక్షణమే పోలీసులకు తెలియజేయాలి తప్ప, ఏ పరిస్థితుల్లోనూ నిందితులపై ప్రత్యక్ష దాడులకు పాల్పడి చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని స్పష్టం చేశారు.



## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆర్థిక సాయం

- ఆంగోత్ రవి నాయక్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా

**పెద్దమందడి,మే13(తెలంగాణ ముచ్చట్లు) :** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామం చెరువుకొమ్ము తాండాకు చెందిన ఆంగోత్ రవి నాయక్ అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకుల ద్వారా బాధిత కుటుంబానికి 5000/ వేల రూపాయల సహాయం అందించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని నాయకులు భరోసా ఇచ్చారు. స్థానిక ఉప సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు ఘటన విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి ఆర్థిక సాయం అందించాలని సూచించారు.దీంతో అమ్మపల్లి గ్రామ సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, ఉప సర్పంచ్ బాబు నాయక్, మాజీ సర్పంచ్ రమేష్, ఉప సర్పంచ్ ఆంజనేయులు తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో చెరువుకొమ్ము తాండా పెద్దలు, తండావాసులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'డబుల్ ఇంజిన్' అంటే పేపర్ల లీకేజీయేనా?

- కేంద్రం అసమర్థతకు 'నీట్' కుంభకోణమే నిదర్శనం
- కూసుమంచి మండలం జీళ్లచెరువు క్లస్టర్ ప్రజా దర్బార్‌లో మంత్రి పొంగులేటి గర్జన



**ఖమ్మం బ్యూరో, మే 13(తెలంగాణ ముచ్చట్లు ):**కేంద్రంలోని బీజేపీ సర్కార్ తన అసమర్థతతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టింది. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే అభివృద్ధి చేయడం కాదు.. పేపర్లు లీక్ చేసి నిరుద్యోగుల గొంతు కోయడమేనా? అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జీళ్లచెరువులో నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

కేంద్రానిది కళ్లుండి చూడలేని తనం!

నీట్ పరీక్షా పత్రాల లీకేజీపై మంత్రి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పరీక్షకు 42 గంటల ముందే పేపర్లు బయటకు రావడం దారుణమన్నారు. దేశవ్యాప్తంగా 23 లక్షల మంది మన రాష్ట్రంలో 70 వేల మంది విద్యార్థులు ఈ కుంభకోణం వల్ల రోడ్డున పడ్డారని అవేదన వ్యక్తం చేశారు. కేంద్రం మాత్రం ఏమీ ఎరుగనట్లు నాటకమాడుతోందని విమర్శించారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన విద్యార్థులను ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నాడు దొరల పాలనలోనూ...

తెలంగాణలో గత పదేళ్ల 'దొరల పాలన'లో జరిగిన అన్యాయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేశారు. "గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రూప్1 నుంచి గ్రూప్4 వరకు అన్ని పేపర్లూ లీక్ అయ్యాయన్నారు. ఆనాటి ప్రభుత్వ మంత్రుల పీఏలే జిరాక్స్ సెంటర్లలో పేపర్లు అమ్మారని ఆరోపించారు. ఆనాడు ఇంటర్ ఫలితాల తారుమారు వల్ల 28 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తోందని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే నియామక సంస్థలను ప్రక్షాళన చేసి, పారదర్శకంగా 70 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని చెప్పారు.

ప్రజా దర్బార్‌లో అర్జీల వెల్లువ

జీళ్ళచెరువు క్లస్టర్ పరిధిలోని 13 గ్రామ పంచాయతీల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి మంత్రి పొంగులేటి జిల్లా కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, భూ సమస్యలపై వచ్చిన వినతులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. న్యాయమైన ప్రతి సమస్యను 100 శాతం పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

# మక్కా రైతుల కోసం మార్కెట్ యార్డులోనే గర్జించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



**జమ్మికుంట టౌన్ మే 13 (తెలంగాణ ముచ్చట్లు):** హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి జమ్మికుంట పత్తి మార్కెట్‌లోని మార్క్‌ఫెడ్ మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించి రైతుల సమస్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డులో వేలాది మక్కల బస్తాలు పేరుకుపోవడం, కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతుండటంపై రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.

మార్కెట్‌లో సుమారు 40 వేల మక్కల బస్తాలు నిల్వ ఉండటంతో రైతులు రోజుల తరబడి మార్కెట్ యార్డులోనే పడిగాపులు కాస్తున్నారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సరైన సమయంలో న్యాయం జరగకపోతే సహించబోనని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ...

"రెండు రోజుల్లో ఈ మక్కల బస్తాలను తరలించకపోతే మార్కెట్ యార్డులోనే రైతులతో కలిసి పడుకుంటా. రైతులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోను" అంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

మక్కల తరలింపులో కొందరు డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు రావడం దురదృష్టకరమని పేర్కొన్న ఎమ్మెల్యే, ఇలాంటి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

హమాలీల కొరత కారణంగా లోడింగ్, అన్‌లోడింగ్ పనులు పూర్తిగా దెబ్బతిన్నాయని మార్కెట్ సిబ్బంది ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే అదనపు హమాలీలను ఏర్పాటు చేసి కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు.

అనంతరం మార్కెట్ పాలకవర్గం, ఆర్డీఓ, మార్క్‌ఫెడ్ అధికారులు, సిబ్బంది మరియు రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలపై సమీక్షించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు.

రైతు కష్టానికి అండగా... రైతు హక్కుకు భరోసాగా...

మార్కెట్‌లో రైతుల కోసం పోరాడుతున్న నాయకుడిగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నిలిచారని రైతులు అభిప్రాయపడ్డారు.

# ఆధ్యాత్మిక శోభితం.. ప్రతిష్ఠాపన మహోత్సవం

- ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- ఆలయ అభివృద్ధికి రూ. 50 వేల విరాళం
- రామన్నపేటలో అట్టహాసంగా విగ్రహ ప్రతిష్ఠాపన



**ఖమ్మం బ్యూరో, మే 13(తెలంగాణ ముచ్చట్లు ):**భక్తి మార్గం ద్వారానే మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని, ధార్మిక కార్యక్రమాలతో లోక కల్యాణం జరుగుతుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం కార్పొరేషన్ 60వ డివిజన్ పరిధిలోని రామన్నపేటలో బుధవారం అత్యంత వైభవంగా జరిగిన శ్రీ పెద్దమ్మ తల్లి, పోతురాజు, సింహ వాహన, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారంగా రూ. 50,000 విరాళాన్ని అందజేసి మంత్రి తన ఉదారతను చాటుకున్నారు.

మంత్రికి ఘన స్వాగతం...

ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి పొంగులేటికి అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని, గ్రామాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

శాస్త్రోక్తంగా ప్రతిష్ఠా పర్వం...

మూడు రోజుల పాటు సాగిన ఈ ఉత్సవాలు బుధవారం నాటి ప్రధాన ఘట్టంతో ముగిశాయి. ఉదయం 9:24 గంటలకు సుముహూర్తాన వేద మంత్రోచ్చారణల మధ్య యంత్రస్థాపన, బింబస్థాపన నిర్వహించారు. పంచముఖి నాగేంద్రుడు, జంటనాగుల ప్రతిష్ఠాపన , నేత్రోన్మీలన, ప్రాణప్రతిష్ఠాపన వంటి కార్యక్రమాలను అర్చక బృందం శాస్త్రోక్తంగా పూర్తి చేశారు.

ముగిసిన ఉత్సవాలు...

మంత్రి పర్యటనతో రామన్నపేటలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ప్రతిష్ఠా కార్యక్రమాల అనంతరం పూర్ణాహుతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమంలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. ఈ వేడుకలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, రామన్నపేట పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సారపాక బ్రిడ్జి ఘటనపై చర్యలు తీసుకోవాలి

- నాసిరకం పనుల వల్లే కుంగిపోయిందని ఆధార్ పార్టీ ఆరోపణ.



**భద్రాచలం, మే 13(తెలంగాణ ముచ్చట్లు):** సారపాక వద్ద కుంగిపోయిన ప్రధాన బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యతా లోపాలు ఉన్నాయని, బాధ్యులపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆధార్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కంటే కేశవ్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఘటనాస్థలాన్ని పరిశీలించి బ్రిడ్జి కుంగిపోయిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన బ్రిడ్జి ఏడాది గడవకముందే కుంగిపోవడం నాసిరకం పనులకు నిదర్శనమని ఆరోపించారు. నిర్మాణంలో నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్‌తో పాటు సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే విధంగా పనులు చేపట్టడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని, లేకపోతే ఆధార్ పార్టీ ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అశ్వరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ వూకే ముత్తయ్య దొర, కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బోడికల ప్రేమ్ దయాల్, వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలోత్ శ్యామలాల్ నాయక్, ఖమ్మం జిల్లా ఆధార్ పార్టీ అధ్యక్షుడు కుక్కల నాగేశ్వరరావు గౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్రం వైఫల్యం

**ప్రధాని మోదీ సమాధానం చెప్పాలి డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి**

**వనపర్,మే13(తెలంగాణ ముచ్చట్లు):** నీట్ ప్రవేశ పరీక్ష ప్రశ్నాపత్రం మరోసారి లీక్ కావడం దేశ విద్యా వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసిందని తెలంగాణ రాష్ట్ర ఏఐపిసి అధ్యక్షులు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి ఈ అంశంపై బుధవారం ఒక ప్రకటనలో స్పందించారు.గుజరాత్, బీహార్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో వరుసగా లీక్ ఘటనలు బయటపడటం పరీక్షల నిర్వహణలో తీవ్ర లోపాలను చూపిస్తోందని పేర్కొన్నారు.పరీక్షకు ముందే ప్రశ్నలు బయటకు రావడం అత్యంత ఆందోళనకరమని, ప్రశ్నాపత్రాల భద్రతలో జాతీయ పరీక్షల సంస్థ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. లక్షలాది మంది విద్యార్థులు కష్టపడి సిద్ధమవుతుంటే, కేంద్ర ప్రభుత్వం వారి భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు.ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల రద్దులు, మళ్లీ పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు.గత పదకొండు సంవత్సరాల్లో ప్రశ్నాపత్రాల లీకులు సాధారణ ఘటనలుగా మారిపోయాయని ఆరోపించారు.నీట్ ప్రశ్నాపత్రం లీక్ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ నైతిక బాధ్యత వహించి దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పారదర్శక దర్యాప్తు చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.





## జగ్గయ్యపేటలో నిలిచిపోయిన మొక్కజొన్న లోడ్లు

**కలెక్టర్‌కు రైతుల విన్నపం**

**ఖమ్మం బ్యూరో , మే 13(తెలంగాణ ముచ్చట్లు ):** చింతకాని మండలం రేపల్లేవాడ మరియు నాగులవంచ గ్రామ రైతులు తమ పండించిన మొక్కజొన్నను అమ్ముకోలేక, రవాణా ఇబ్బందులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాగులవంచ సొసైటీ నుండి మొక్కజొన్న లోడ్లతో జగ్గయ్యపేటకు వెళ్లిన లారీలు గత 12 రోజులుగా అక్కడే నిలిచిపోయాయి. మే 2వ తేదీన జగ్గయ్యపేట వెళ్లిన లారీలు, అక్కడ గోదాములు నిండిపోయాయనే కారణంతో నేటికీ అన్‌లోడ్ కాలేదు. దాదాపు 12 రోజులుగా లారీలు ఖాళీ కాకపోవడంతో, లారీ ఓనర్లు మరియు డ్రైవర్లు సరుకును ఊరి బయట పారబోసి వెళ్ళిపోతామని రైతులపై ఒత్తిడి తెస్తున్నారు.

సుమారు 13 మంది రైతులకు చెందిన 3109 బస్తాల మొక్కజొన్న లోడ్లు లారీలలోనే ఉండిపోయాయి.

జాయింట్ కలెక్టర్‌కు వినతి:

ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ రేపల్లేవాడ మరియు నాగులవంచ గ్రామ రైతులు బుధవారం ఖమ్మం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి కి వినతి పత్రం సమర్పించారు.గోదాములను పరిశీలించి,వెంటనే తమ లారీలను అన్‌లోడ్ చేయించేలా చర్యలు తీసుకోవాలని వారు వేడుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో బాధితులైన రైతులు పాల్గొన్నారు

# శ్రీ వల్లి సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

**విగ్రహ ప్రతిష్ఠాపన చేసిన రాపర్తి నరసింహారావు వెంకట్ లక్ష్మి పుణ్య దంపతులు**

**ఖమ్మం బ్యూరో ,13 మే(తెలంగాణ ముచ్చట్లు ):**ఖమ్మం రూరల్ ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలో గల వరంగల్ క్రాస్ రోడ్ లోని, శ్రీ అభయ అంజయనేయ స్వామి ఆలయంలో శ్రీ వల్లి సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

విగ్రహ ప్రతిష్ఠాకార్యక్రమంలో రాపర్తి నరసింహారావువెంకటల్ లక్ష్మి, పుణ్య దంపతులు పాల్గొని, వేద పండితుల సమక్షంలో స్వామి వారికి మొదటగా గణపతి పూజ, నవగ్రహ పూజలు మరియు హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో రాపర్తి వెంకట్ సాయి, రాపర్తి జననీ, కడియాల నాగులు, కడియాల భూలక్ష్మి, వేద పండితులు మారంరాజు ఫణి ప్రసాద్, మారంరాజు రమాదేవి, లక్ష్మణ్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

**ఖమ్మం బ్యూరో , మే, 13(తెలంగాణ ముచ్చట్లు ):** రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సిఫారసు మేరకు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఖమ్మం నగరం బుర్హాన్ పురంకు చెందిన శెట్టి ప్రవీణ్ కుమార్, ఇల్లెందు మండలం కట్టుగూడెం గ్రామానికి చెందిన రామలింగాచారి లు అనారోగ్యం తో చికిత్స పొంది సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ మేరకు మంజూరైన రూ. 1,08,000 ల విలువైన చెక్కులను ఎంపీ రవిచంద్ర వ్యక్తిగత సహాయకుడు సయ్యద్ ఇస్మాయిల్ బాధితులకు అందజేశారు.

# సొంతింటి కల నెరవేరిందంటూ లబ్ధిదారుల ఆనందం

**ఎల్కతుర్తి, మే 13 (తెలంగాణ ముచ్చట్లు):**ఎల్కతుర్తి మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించిన లబ్ధిదారులు తేలుక రమ్య - మధు గారి నూతన గృహ ప్రవేశ కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ విజయ్ కుమార్ హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల పేద కుటుంబాల సొంతింటి కలలు సాకారమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు.



లబ్ధిదారులు రమ్య మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన తమ సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతో నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారం, స్థానిక కాంగ్రెస్ నాయకుల ప్రోత్సాహంతో ఈ ఇల్లు నిర్మించుకోగలిగామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయం పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతోందన్నారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గృహప్రవేశ వేడుకలను సందడిగా నిర్వహించారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు శీలం అనిల్‌కుమార్, ఏఎంసీ డైరెక్టర్ రాజయ్య గౌడ్, కాంగ్రెస్ నాయకులు పాక రమేష్, కడారి సురేందర్, కె. మహేష్ చారి, ఏ. మధు, ఆర్. బాస్కర్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మోకాలి కీలు మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం

**హుజురాబాద్. మే 13(తెలంగాణ ముచ్చట్లు ):** హుజూరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సొల్లు బాబు మోకాలి కీలు మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తైంది. కరీంనగర్‌లోని రేణి హాస్పిటల్ లో ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ బంగారు స్వామి ఆధ్వర్యంలో ఎడమ కాలి మోకాలి ఆపరేషన్ నిర్వహించారు.

సొల్లు బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతోమంది మోకాలి నొప్పులతో బాధపడుతున్నారని తెలిపారు. సాధారణంగా మోకాలి కీలు మార్పిడి శస్త్రచికిత్సకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పారు. అయితే డాక్టర్ బంగారు స్వామి, డాక్టర్ రజని దంపతులు తమ తల్లిదండ్రులు బంగారు లక్ష్మి - మైసయ్యల పేరుమీద సేవా కార్యక్రమంగా 200 మందికి పైగా దరఖాస్తులు స్వీకరించి, వారిలో లాటరీ పద్ధతిలో 15 మందిని ఎంపిక చేసి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారని వివరించారు.

ఆ ఎంపికైన వారిలో తన పేరు కూడా రావడంతో ఉచితంగా ఆపరేషన్ చేయించుకున్నానని తెలిపారు. ఈ సందర్భంగా 5వ వార్డు కౌన్సిలర్ సొల్లు సునీత మాట్లాడుతూ డాక్టర్ బంగారు స్వామి, డాక్టర్ రజని అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. తన భర్తకు విజయవంతంగా చికిత్స అందించిన వైద్యులు మరియు ఆస్పత్రి సిబ్బందికి తాము ఎప్పటికీ రుణపడి ఉంటామని ఆమె తెలిపారు.



## ఆడబిడ్డకు అన్యాయం జరిగితే జిల్లాలో మహిళా నేతలే లేరా..?



**బండి భగీరథ ఘటనపై మౌనం పాటిస్తున్న రాజకీయ పార్టీలను ప్రశ్నిస్తున్న ప్రజలు**


వనపర్తి,మే13(తెలంగాణ ముచ్చట్లు) : కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై నమోదైన పోక్సో కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన నేపథ్యంలో, వనపర్తి జిల్లాలో మహిళా నేతలు, రాజకీయ పార్టీలు స్పందించకపోవడంపై ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఒక మైనర్ బాలికపై అత్యాచారయత్నం ఆరోపణలు వెలుగులోకి వచ్చినా, మహిళా హక్కుల గురించి మాట్లాడే నాయకులు మౌనం పాటించడం బాధాకరమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా మహిళా నేతలు మీడియా ముందుకు వచ్చి ఘటనను ఖండించకపోవడం, కనీసం ప్రకటన రూపంలోనైనా స్పందించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.మహిళల భద్రత, బాలికల హక్కుల అంశాల్లో ఎప్పుడూ గొంతెత్తే నాయకులు ఇప్పుడు ఎందుకు నిశ్శబ్దంగా ఉన్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో మహిళా నేతలే లేరా..? అంటూ సామాన్యులు నిలదీస్తున్నారు.వ్యక్తిగతంగా రాజకీయ లాభం చేకూరే అంశాలపై మాత్రం రాజకీయ పార్టీలు, మహిళా నేతలు పెద్ద ఎత్తున ప్రచారాలు, ఆర్భాటాలు నిర్వహిస్తారని, కానీ ఒక ఆడపిల్లకు అన్యాయం జరిగితే స్పందించకుండా మౌనం పాటించడం దురదృష్టకరమని ప్రజలు విమర్శిస్తున్నారు.ఈ ఘటనపై జిల్లాలో అధికార, ప్రతిపక్ష పార్టీల నుంచి పెద్దగా స్పందన లేకపోవడం గమనార్హం.కేవలం బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాత్రమే ఘటనను ఖండించారు.ఒక ఆడపిల్లకు అన్యాయం జరిగితే రాజకీయాలకు అతీతంగా అందరూ స్పందించాల్సిన అవసరం ఉందని, బాధితురాలికి న్యాయం జరిగేలా మహిళా సంఘాలు, రాజకీయ పార్టీలు ముందుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.

## రైతన్న గళం గర్జించబోతోంది... కరీంనగర్‌లో రైతు మహా సమరభేరికి సన్నాహాలు!

**హుజురాబాద్, మే 13(తెలంగాణ ముచ్చట్లు ):** రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30వ తేదీన కరీంనగర్‌లో భారీ స్థాయిలో నిర్వహించనున్న "రైతు మహా గర్జన సమరభేరి" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘాల సమాఖ్య జాతీయాధ్యక్షుడు పోలాడి రామారావు పిలుపునిచ్చారు. బుధవారం హుజురాబాద్‌లో సభకు సంబంధించిన గోడపత్రాలను ఆవిష్కరించి రైతాంగాన్ని చైతన్యపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగం నేడు అనేక ఇబ్బందులతో సతమతమవుతోందన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, సాగునీటి కొరత, ఎరువులు-విత్తనాల సమస్యలు, విద్యుత్ అంతరాయాలు, అకాల వర్షాలతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతు సమస్యలపై ప్రభుత్వాలు సరైన స్పందన చూపడం లేదని విమర్శించారు.

రైతుల హక్కుల సాధన కోసం, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టేందుకు కరీంనగర్‌లో నిర్వహించే రైతు మహా గర్జన సమరభేరికి ప్రతి గ్రామం నుంచి రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. రైతుల ఐక్యతే సమస్యల పరిష్కారానికి మార్గమని పేర్కొన్నారు. ఈ గోడపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొని సభ విజయవంతానికి కృషి చేయాలని సంకల్పించారు.




మనిషి మట్టిలో నుంచి పుడతాడు, మట్టిలోకే వెళ్తాడు. కానీ, ఆ పుట్టుకకు, గిట్టుకకు మధ్య మనిషిని మనిషిగా తీర్చిదిద్దేది సమాజం. సమాజం అంటే కేవలం మనుషుల సమూహం కాదు. అది ఒక తల్లి. మనకు పాలిచ్చి పెంచేది, తప్పటడుగులు వేయించి నడక నేర్పేది, మన భావాలకు భాషనిచ్చేది ఆ సమాజమే. కానీ, విచారకరమైన విషయం ఏమిటంటే నేడు ఆ అమ్మ నిస్సహాయంగా, నిశ్శబ్దంగా ఒక మూలన కూర్చుని కన్నీరు మున్నీరవుతోంది. ఆమె గొంతులో జీవం లేదు, ఆమె కేకలో సత్తువ లేదు. ఆమె గుండె చప్పుడు ఆగిపోతున్న వేళ, చుట్టూ ఉన్న కోట్లాది మంది బిడ్డలు మాత్రం గాఢ నిద్రలో మునిగిపోయి ఉన్నారు. ఎవరూ మేల్కొనడం లేదు, ఎవరూ అన్యాయాన్ని ప్రశ్నించడం లేదు. అందుకే, ఈ అక్షరం నేడు ఒక ఆయుధమై అరుస్తోంది గర్జించు రా సమాజమా!చరిత్ర పుటలు తిరగేస్తే, ఈ గడ్డ మీద అన్యాయాన్ని చీల్చి చెండాడిన మహాత్ములు కనిపిస్తారు. బుద్ధుడు, అంబేద్కర్, శ్రీకృష్ణదేవరాయలు, కందుకూరి వీరేశలింగం వీరంతా కేవలం రక్తమాంసాలున్న వ్యక్తులు మాత్రమే కాదు.వీరు సమాజం యొక్క సజీవ గొంతులు. సామాజిక అరాచకాలను చూసినప్పుడు వారి రక్తం మరిగింది, వారి కలం గర్జించింది. దోపిడీని చూసి వారు నోరు మూసుకోలేదు, అణచివేతను చూసి తల వంచలేదు. కానీ, 21వ శతాబ్దపు ఆధునిక సమాజంలో ఏం జరుగుతోంది? వీధిలో ఒక అన్యాయం జరుగుతుంటే, ఒక మనిషి ప్రాణాపాయంలో కొట్టుమిట్టాడుతుంటే మన చేతులు సాయం కోసం చాచడం లేదు, బదులుగా స్మార్ట్‌ఫోన్లు తీసి వీడియోలు తీస్తున్నాయి. ఆ దృశ్యాన్ని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడంలో ఉన్న ఉత్సాహం, ఆ మనిషిని రక్షించడంలో ఉండటం లేదు. ఇది నా పని కాదు అనే ఉదాసీనత మనల్ని ఆవహించింది. అగ్నిపర్వతంలా రగిలిపోవాల్సిన యువ హృదయాలు, నేడు చల్లటి రాళ్ళలా మారిపోయాయి. మనిషి మనిషికి దూరమయ్యాడు, సమాజం తనలోని ఆత్మను కోల్పోయి శత్రువుగా మారుతోంది. ఈ మౌనమే నేడు మన నాగరికతకు పట్టిన అతిపెద్ద శాపం. ఒక భయంకరమైన సత్యాన్ని మనం ఒప్పుకోవాలి. మనం అన్యాయానికి అలవాటు పడిపోతున్నాం. బస్సులో ఒక మహిళ వేధింపులకు గురవుతుంటే, పక్కనే ఉన్న ముప్పై మంది ప్రయాణికులు కిటికీలోంచి బయట ప్రపంచాన్ని చూస్తున్నట్లు నటిస్తారు. ఒక పేద రైతు అప్పుల ఊబిలో చిక్కుకుని తనువు చాలిస్తే, అది మరుసటి రోజు వార్తాపత్రికలో ఒక మూలన చిన్న కాలమ్‌గా మిగిలిపోతోంది. ఒక చిన్నారి ఆకలితో అలమటిస్తూ బడికి వస్తుంటే, మన కళ్ళు అది చూడవు. రోడ్డు పక్కన అనాథగా పడి ఉన్న వృద్ధుడిని చూసి మనం వేగంగా వెళ్ళిపోతాం.

అన్యాయాన్ని చూసి మిన్నకుండిపోవడం కేవలం పిరికితనం కాదు, అది ఒక సామాజిక నేరం. మహాత్మా గాంధీ గారు ప్రపంచంలో మార్పును చూడాలనుకుంటే, ఆ మార్పు మొదట నీలోనే రావాలి అన్నారు. కానీ ఆ మాటలు నేడు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితమయ్యాయి. సమాజం అన్యాయాన్ని భరిస్తూ పోతే, కాలక్రమేణా ఆ అన్యాయమే ఒక సంస్కృతిగా మారిపోతుంది. అది మన భావి తరాలకు మనం ఇచ్చే అత్యంత ప్రమాదకరమైన కానుక.మనం నిత్యం "భారత మాతా కీ జై" అని గొంతు చించుకుంటాం. కానీ, అదే సమాజంలో ఒక మహిళ రాత్రి వేళ ఒంటరిగా ఇంటికి వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి. ఒక సోదరి బహిరంగ ప్రదేశాల్లో రక్షణ లేక తల్లడిల్లుతోంది. ఒక కూతురు తన కలలను నిజం చేసుకోవాలనుకుంటే, ఆడపిల్లవు నీకెందుకు ఈ ఆశలు? అనే అడ్డుగోడలు సమాజం కడుతోంది. స్త్రీని దేవతగా పూజించడం పక్కన పెట్టి, కనీసం ఒక మనిషిగా గౌరవించడం ఎప్పుడు నేర్చుకుంటాం?గర్జించు రా సమాజమా! ఒక సోదరి అవమానానికి గురైనప్పుడు నీ గళం ఎందుకు మూగబోతోంది? ఒక తల్లి కన్నీరు చూసినప్పుడు నీ గుండె ఎందుకు కరగడం లేదు? నినాదాలు చేయడం కాదు, రక్షణ కల్పించడం ముఖ్యం. గౌరవం అనేది మాటల్లో ఉండకూడదు, అది నీ నడవడికలో కనిపించాలి.అన్నం పెట్టేవాడు అర్ధాకలితో చనిపోతున్నాడు. భూమిని తల్లిలా భావించి సేద్యం చేసే రైతు, ఆ తల్లి ఒడిలోనే బలవన్మరణానికి పాల్పడుతున్నాడు. వాన రాకపోయినా రైతుకు నష్టమే, అతివృష్టి వచ్చి పంట కొట్టుకుపోయినా నష్టమే. అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతును ఆదుకోవడానికి రాజకీయ యంత్రాంగాలు కేవలం హామీలకే పరిమితమవుతున్నాయి.ఒక రైతు ఆత్మహత్య చేసుకుంటే అది ఒక వార్తగా మాత్రమే మిగిలిపోతోంది. మీడియా ఛానెల్లు రేటింగ్‌ల కోసం పాకులాడుతున్నాయి, నాయకులు ఓట్ల లెక్కలు వేసుకుంటున్నారు. మరి సమాజం ఏం చేస్తోంది? రైతు పండించిన కూరగాయల ధర తగ్గితే సంతోషించే మనం, ఆ పంట పండించడానికి అతను పడ్డ కష్టాన్ని గుర్తించలేకపోతున్నాం. సమాజం గర్జించాలి, రైతు గొంతుకు అండగా నిలవాలి. రైతు లేని సమాజం పునాది లేని ఇల్లు వంటిదని గుర్తుంచుకోవాలి.నేటి భారతదేశంలో అతిపెద్ద బలం యువత. మన జనాభాలో మెజారిటీ 35 ఏళ్ల లోపు వారే. ఈ అపారమైన శక్తినంతా మనం ఎక్కడ ఖర్చు చేస్తున్నాం? రోజంతా స్మార్ట్‌ఫోన్లలో స్క్రోలింగ్ చేస్తూ, రీల్స్ చూస్తూ, అర్థం లేని ట్రెండ్స్ వెంట పరుగెడుతున్నాం. టెక్నాలజీని వాడటం తప్పు కాదు, కానీ టెక్నాలజీకి బానిసలైపోయి కళ్ళముందు జరుగుతున్న అరాచకాలను విస్మరించడమే ప్రమాదం.భగత్ సింగ్‌కు కేవలం 23 ఏళ్ల వయసులోనే దేశం కోసం ఉరికొయ్యను ముద్దాడే ధైర్యం ఉంది. అంబేద్కర్ తన 20 ఏళ్ల ప్రాయంలోనే ప్రపంచ విజ్ఞానాన్ని ఒడిసి పట్టి సామాజిక విప్లవానికి నాంది పలికారు. మరి నేటి యువత ఏం చేస్తోంది? తమ ఫాలోవర్ల సంఖ్య గురించి ఆందోళన చెందుతోంది తప్ప, తమ చుట్టూ ఉన్న సమాజం గురించి ఆలోచించడం లేదు. యువత మేల్కొని గళం విప్పితేనే అసలైన విప్లవం మొదలవుతుంది. మీరు ఏ సమాజంలో జీవించాలనుకుంటున్నారు? ప్రశ్నించే తత్వమున్న సమాజమా లేక తలవంచే బానిసత్వమా?నేటి విద్యావ్యవస్థ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడం లేదు. కేవలం సర్టిఫికెట్లు కలిగిన యంత్రాలను ఉత్పత్తి చేస్తోంది. మార్కులు మాత్రమే విజయానికి కొలమానం అయిపోయాయి. ఒక మనిషికి ఉండాల్సిన కనీస నీతి, సంస్కారం, సామాజిక స్పృహ అనేవి పాఠ్య ప్రణాళికలో (సిలబస్‌లో) లేవని ఎవరూ నేర్పడం లేదు.బడిలో పాఠాలు చెప్తున్నారు కానీ, జీవితంలో సమస్యలను ఎలా ఎదుర్కోవాలో నేర్పడం లేదు. పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడానికి మార్గాలు చూపిస్తున్నారు కానీ, ఒక అన్యాయం జరిగినప్పుడు ఎలా నిలబడాలో నేర్పడం లేదు. ఈ లోపాన్ని సరిదిద్దే బాధ్యత సమాజానిదే. కుటుంబాలు, పాఠశాలలు విఫలమైనా సమాజం అనే పెద్ద బడి విఫలం కాకూడదు.రాజకీయాలు సమాజాన్ని నడిపిస్తాయని మనమంతా భావిస్తాం. కానీ నిజానికి, సమాజం ఎలా ఉంటే రాజకీయాలు అలానే ఉంటాయి. మనం ఎలాంటి నాయకులను ఎన్నుకుంటామో, మనం ఎలాంటి విలువల కోసం నిలబడతామో మన భవిష్యత్తును అవే నిర్ణయిస్తాయి. ప్రజలు మౌనంగా ఉన్నప్పుడు అన్యాయం చేసేవారికి, అవినీతిపరులకు ధైర్యం పెరుగుతుంది. మౌనం అనేది ఆమోదానికి సంకేతం.గర్జించు రా సమాజమా! నిన్ను నిద్రపుచ్చే శక్తులను నిలదీయి. నీ హక్కుల కోసం నీవే గొంతెత్తు. కులమతాల పేరుతో నిన్ను విడదీసే వారి కుతంత్రాలను తిప్పికొట్టు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా ఇంకా కుల సంకెళ్లలో బందీగా ఉండటం మన దురదృష్టం. మనిషిని మనిషిగా చూసే రోజు కోసం మనం గర్జించాలి.అభివృద్ధి పేరుతో మనం చేస్తున్న విధ్వంసం భయంకరంగా ఉంది. అడవులను నరికేస్తున్నాం, నదులను కలుషితం చేస్తున్నాం, పీల్చే గాలిని విషతుల్యం చేస్తున్నాం. రేపటి తరానికి మనం ఇచ్చే ఆస్తి ఏది? కరెన్సీ నోట్లా? లేక కలుషితమైన భూమినా? స్వచ్ఛమైన గాలి, నీరు లేనినాడు ఆ కరెన్సీ నోట్లు ప్రాణాన్ని కాపాడలేవు. పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వాల బాధ్యత కాదు, అది ప్రతి వ్యక్తి బాధ్యత. మన పిల్లల భవిష్యత్తు కోసం మనం ప్రకృతి విధ్వంసానికి వ్యతిరేకంగా గర్జించాలి.నేను ఒక్కడిని ఏం చేయగలను? అనే ఆలోచనను వదిలేయండి. చరిత్రను మార్చిన వారంతా ఒక్కరుగా మొదలైనవారే. గాంధీ, నెల్సన్ మండేలా, మలాలా యూసఫ్‌జాయ్ వీరంతా ఒక్కరుగానే ప్రయాణం మొదలుపెట్టారు. మీ గొంతు చిన్నది కావచ్చు, కానీ అది నిజాయితీతో కూడుకున్నదైతే ప్రపంచాన్నే కదిలిస్తుంది. మీరు మారిన రోజు మీ ఇల్లు మారుతుంది, మీ ఇల్లు మారిన రోజు వీధి మారుతుంది, క్రమంగా సమాజం మారుతుంది.ఈ వ్యాసం చదివిన ప్రతి పాఠకుడికి నాదొకటే విన్నపం గతకాలపు సమాజం నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలి, కానీ రేపటి సమాజం ఎలా ఉండాలో నేడే నిర్ణయించుకోవాలి. ఆ నిర్ణయం కేవలం ఐదేళ్లకు ఒకసారి వేసే ఓటులో మాత్రమే ఉండకూడదు; అది మన ప్రతిరోజూ చేసే పనిలో ఉండాలి.ఒక మహిళ వేధింపులకు గురవుతుంటే రక్షకుడిగా నిలబడు. ఒక రైతు కష్టంలో ఉంటే అండగా ఉండు. ఒక ఆకలితో ఉన్న చిన్నారికి నీ కడుపులో ముద్దను పంచు. అన్యాయం జరిగిన చోట గొంతు విప్పి ప్రశ్నించు. నిజం చెప్పే ధైర్యాన్ని అణచివేయనివ్వకు. ఇదే నిజమైన దేశభక్తి. ఇదే అసలైన మానవత్వం.గర్జించు రా సమాజమా! ఇది కేవలం ఒక పోరాటం కాదు, ఇది మన ఉనికి కోసం పడే తపన. ఇది ఒక మంచి రేపటి కోసం, మన పిల్లల స్వచ్ఛమైన నవ్వు కోసం, ఈ మట్టి గౌరవం కోసం. నిద్రపోతున్న మనస్సాక్షిని తట్టి లేపు.మార్పు దిశగా అడుగులు వేయ్. ఎందుకంటే, నిశ్శబ్దం నేరం.గర్జన మాత్రమే విముక్తి!




డా.సూర్యదేవర రామకృష్ణ


# ఒడుదొడుకుల్లోనూ లాభాల్లో ముగిసిన మార్కెట్లు




దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం తీవ్ర హెచ్చుతగ్గుల మధ్య స్వల్ప లాభాలతో ముగిశాయి. రోజు మొత్తం ఒడుదొడుకులకు లోనైన సూచీలు చివరికి మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల మద్దతుతో గ్రీన్‌లో నిలిచాయి. అయితే ఐటీ, బ్యాంకింగ్, ఆటో రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కొనసాగడంతో మార్కెట్ల లాభాలు పరిమితమయ్యాయి.

ట్రేడింగ్ ముగిసే సమయానికి 30 షేర్ల సెన్సెక్స్ 49.74 పాయింట్లు పెరిగి 74,608.98 వద్ద ముగిసింది.ఒక దశలో సూచీ 74,134.48 కనిష్ఠ స్థాయికి పడిపోగా, మరో దశలో 75,191.57 గరిష్ఠాన్ని తాకింది. ఇక నిఫ్టీ 33.05 పాయింట్లు లాభపడి 23,412.60 వద్ద స్థిరపడింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో నిఫ్టీ 23,262.55 కనిష్ఠాన్ని, 23,582.95 గరిష్ఠాన్ని నమోదు చేసింది.

మార్కెట్ విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీకి 23,300 స్థాయి తక్షణ మద్దతుగా ఉండగా, ఆ తర్వాత 23,100 వద్ద మరో కీలక సపోర్ట్ కనిపిస్తున్నది. మరోవైపు 23,500 స్థాయిని దాటడంలో విఫలమవడంతో అది తక్షణ నిరోధక స్థాయిగా మారిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రంగాల వారీగా చూస్తే మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ రంగాలు మంచి కొనుగోళ్లతో రాణించాయి. నిఫ్టీలో ఏషియన్ పెయింట్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, టాటా స్టీల్ వంటి షేర్లు టాప్ గెయినర్లుగా నిలిచాయి. మరోవైపు ఐటీ, ఆటో, బ్యాంకింగ్, మీడియా రంగాల్లో అమ్మకాలు కొనసాగాయి. దీంతో ఆ సూచీలు నష్టాల్లో ముగిశాయి.

బ్రాడర్ మార్కెట్లలో కూడా సానుకూల ధోరణి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.77 శాతం లాభపడగా, స్మాల్‌క్యాప్ సూచీ 0.31 శాతం పెరిగింది. మధ్యతరహా, చిన్నతరహా షేర్లలో పెట్టుబడిదారుల ఆసక్తి కొనసాగుతున్నట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

అంతర్జాతీయ పరిణామాలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపించాయి. అమెరికా అధ్యక్షుడు చైనా అధ్యక్షుడు మధ్య జరగనున్న కీలక భేటీపై ఇన్వెస్టర్లు దృష్టిసారించారు. వాణిజ్య సంబంధిత అంశాలు, టారిఫ్ సమస్యలపై ఈ సమావేశంలో చర్చ జరిగే అవకాశముందని భావిస్తున్నారు.

ఇక పశ్చిమాసియాలో కొనసాగుతున్న భౌగోళిక ఉద్రిక్తతలు కూడా పెట్టుబడిదారుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా ఇరాన్‌పై అమెరికా కఠిన వైఖరి, ముడి చమురు ధరల్లో పెరుగుదల వంటి అంశాలు మార్కెట్లపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో రానున్న రోజుల్లో అంతర్జాతీయ పరిణామాలు, యూఎస్‌చైనా చర్చల ఫలితాల ఆధారంగా మార్కెట్ల దిశ నిర్ణయమయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# ఉచితాలు.. అప్పుల కుప్ప




రాష్ట్రాల్లో ఉచిత పథకాల అమలు తీరు ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు ప్రకటిస్తున్న హామీలు ప్రభుత్వ ఖజానాపై మోయలేని భారంగా మారుతున్నాయి. సంక్షేమం పేరుతో పంచుతున్న నిధులు చివరకు రాష్ట్రాల అప్పులను రికార్డు స్థాయికి చేరుస్తున్నాయి. అభివృద్ధి పనులకు కేటాయించాల్సిన నిధులను ఉచిత పథకాలకు మళ్లించడం వల్ల మౌలిక సదుపాయాల కల్పన కుంటుపడుతోందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓట్ల రాజకీయాల కోసం రాష్ట్రాల భవిష్యత్తును పణంగా పెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత గణాంకాల ప్రకారం అనేక రాష్ట్రాల అప్పులు వాటి స్థూల ఉత్పత్తిలో ముప్పై శాతం మించిపోయాయి. కేవలం వడ్డీలు చెల్లించడానికే కొత్త అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. సంక్షేమ పథకాలు అవసరమే అయినప్పటికీ, అవి ఉత్పాదకతను పెంచే విధంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఉచిత విద్యుత్, నగదు బదిలీ వంటి పథకాల వల్ల తాత్కాలిక ప్రయోజనం ఉన్నా, దీర్ఘకాలంలో రాష్ట్ర ఆర్థిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ఆదాయ వనరులను పెంచుకోకుండా కేవలం అప్పులపై ఆధారపడి పాలన సాగించడం వల్ల భవిష్యత్తు తరాలపై పెను భారం పడే ప్రమాదం ఉంది. ఆర్థిక క్రమశిక్షణ పాటించని పక్షంలో శ్రీలంక వంటి దేశాలు ఎదుర్కొన్న సంక్షోభం రాష్ట్రాల్లోనూ తలెత్తే అవకాశం ఉందని హెచ్చరికలు అందుతున్నాయి. కేంద్రీయ సంస్థలు సైతం రాష్ట్రాల రుణ పరిమితిపై కఠిన ఆంక్షలు విధిస్తున్నాయి. ఉచితాల వల్ల ప్రజల్లో సోమరితనం పెరుగుతుందని, కష్టపడే తత్వం తగ్గుతుందని సామాజిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. విద్య, వైద్యం వంటి రంగాల్లో నాణ్యత పెంచడానికి ఖర్చు చేయాల్సింది పోయి, నగదు రూపంలో పంచడం వల్ల శాశ్వత ప్రయోజనం చేకూరదు. పన్నుల ద్వారా వచ్చే ఆదాయం మొత్తం వడ్డీలకు, జీతాలకు సరిపోతుండటంతో కొత్త ప్రాజెక్టులకు నిధుల కొరత ఏర్పడుతోంది.

పాలకులు తమ ప్రాధాన్యతలను మార్చుకోకపోతే ఆర్థిక వ్యవస్థ పతనం తప్పదని విశ్లేషణలు చెబుతున్నాయి. ప్రతి పథకం వెనుక సామాజిక ప్రయోజనం ఉండాలే తప్ప కేవలం ఎన్నికల గెలుపు ఉండకూడదు. అప్పుల భారం పెరిగితే చివరకు పన్నుల భారం సామాన్యుడిపైనే పడుతుంది. పెట్రోల్, డీజిల్ ధరలు, ఇతర సేవలు ప్రియం కావడానికి ఈ ఆర్థిక లోటు కూడా ఒక కారణం. ప్రభుత్వాలు తమ వ్యయాన్ని నియంత్రించుకుని, సంపద సృష్టిపై దృష్టి పెట్టాలి. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాలు కోలుకోవడానికి కఠినమైన సంస్కరణలు తప్పనిసరి.

ఉచిత పథకాలు రాష్ట్రాల అప్పుల భారాన్ని పెంచుతూ ఆర్థిక వ్యవస్థను ప్రమాదంలోకి నెడుతున్నాయి. సంక్షేమం అనేది కేవలం ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికే ఉండాలి తప్ప, ఓట్ల వేటలో ఆయుధం కాకూడదు. రాష్ట్రాలు తమ ఆర్థిక స్థితిగతులను బేరీజు వేసుకుని బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకోవాలి. అభివృద్ధి పథంలో దూసుకుపోవాల్సిన రాష్ట్రాలు అప్పుల భారం కింద నలిగిపోవడం దేశాభివృద్ధికి ఏమాత్రం మంచిది కాదు. నిపుణుల హెచ్చరికలను గమనంలోకి తీసుకుని సత్వరమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. అప్పుడే సుస్థిరమైన ఆర్థిక భవిష్యత్తు సాధ్యమవుతుంది.

# సామాజిక మాధ్యమ ప్రపంచాన్ని మార్చిన మార్క్ జుకర్‌బర్గ్



**చిన్న ఆలోచనతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు**
**ఫేస్‌బుక్‌తో డిజిటల్ ప్రపంచంలో విప్లవం**
**భవిష్యత్ సాంకేతికతలపై దృష్టి సారించిన యువ వ్యాపారవేత్త**

ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది వినియోగిస్తున్న సామాజిక మాధ్యమ వేదిక ఫేస్‌బుక్‌ను స్థాపించిన మార్క్ జుకర్‌బర్గ్ జన్మదినం మే 14న జరుపుకుంటారు. చిన్న వయసులోనే సాంకేతిక రంగంలో అడుగుపెట్టి ప్రపంచ డిజిటల్ వ్యవస్థను మార్చిన వ్యక్తిగా ఆయన ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. సాధారణ విద్యార్థి స్థాయి నుంచి ప్రపంచ ప్రఖ్యాత సాంకేతిక వ్యాపారవేత్తగా ఎదిగిన ఆయన ప్రయాణం యువతకు ప్రేరణగా నిలుస్తోంది. అమెరికాలో జన్మించిన మార్క్ జుకర్‌బర్గ్ చిన్నప్పటి నుంచే కంప్యూటర్లపై ఆసక్తి పెంచుకున్నారు. కొత్త సాఫ్ట్‌వేర్‌లు రూపొందించడం, ప్రోగ్రామింగ్ నేర్చుకోవడం ఆయనకు ఎంతో ఇష్టం ఉండేది. విద్యార్థి దశలోనే కంప్యూటర్ పరిజ్ఞానంలో అసాధారణ ప్రతిభ కనబరిచిన ఆయన భవిష్యత్తులో సాంకేతిక ప్రపంచాన్ని ప్రభావితం చేసే స్థాయికి ఎదుగుతారని అప్పుడే చాలామంది భావించారు. ఉన్నత విద్య కోసం హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చేరిన మార్క్ జుకర్‌బర్గ్ అక్కడే తన స్నేహితులతో కలిసి ఫేస్‌బుక్ వేదికను ప్రారంభించారు. మొదట కళాశాల విద్యార్థుల మధ్య సమాచార మార్పిడికోసం రూపొందించిన ఈ వేదిక కొద్ది కాలంలోనే ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. స్నేహితులు, కుటుంబ సభ్యులు, వ్యాపార సంస్థలు ఒకే వేదికపై కలుసుకునే అవకాశాన్ని ఫేస్‌బుక్ కల్పించింది. ఫేస్‌బుక్ విజయం తర్వాత మార్క్ జుకర్‌బర్గ్ ప్రపంచ సాంకేతిక రంగంలో అత్యంత ప్రభావశీల వ్యక్తుల్లో ఒకరిగా ఎదిగారు. ఆయన ఆధ్వర్యంలోని సంస్థ తరువాత వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్రముఖ సామాజిక మాధ్యమ వేదికలను కూడా తన పరిధిలోకి తీసుకొచ్చింది. దీంతో ప్రపంచ డిజిటల్ సమాచార రంగంలో ఆయన ప్రభావం మరింత పెరిగింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రతిరోజూ ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికలను ఉపయోగిస్తున్నారు. వ్యక్తిగత సమాచార మార్పిడి నుంచి వ్యాపార ప్రకటనలు, విద్య, వినోదం వరకు అనేక రంగాల్లో ఈ వేదికలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రపంచ ప్రజలను మరింత దగ్గర చేసిన వ్యక్తిగా మార్క్ జుకర్‌బర్గ్ గుర్తింపు పొందారు. డిజిటల్ ప్రపంచం భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మార్క్ జుకర్‌బర్గ్ కొత్త సాంకేతిక రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. కృత్రిమ మేధస్సు, వర్చువల్ ప్రపంచం, మెటావర్స్ వంటి ఆధునిక సాంకేతికతల అభివృద్ధికి భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. భవిష్యత్తులో ప్రజలు వర్చువల్ ప్రపంచంలో మరింత సమీపంగా కలిసే విధంగా కొత్త సాంకేతిక మార్పులు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ప్రభావం పెరుగుతున్న కొద్దీ వాటి వల్ల కలిగే సవాళ్లు కూడా పెరుగుతున్నాయి. తప్పుడు సమాచారం వ్యాప్తి, గోప్యత సమస్యలు వంటి అంశాలపై ప్రపంచవ్యాప్తంగా చర్చలు జరుగుతున్నప్పటికీ డిజిటల్ రంగంలో మార్పులు తీసుకురావడంలో మార్క్ జుకర్‌బర్గ్ పాత్రను ఎంతో మంది ప్రశంసిస్తున్నారు. ప్రపంచ సమాచార వ్యవస్థను వేగవంతం చేయడంలో ఆయన సంస్థలు కీలకంగా నిలిచాయి. సాధారణ విద్యార్థి నుంచి ప్రపంచ ప్రఖ్యాత వ్యాపారవేత్తగా ఎదిగిన మార్క్ జుకర్‌బర్గ్ జీవితం ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తోంది. కొత్త ఆలోచన, పట్టుదల, సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచాన్ని ప్రభావితం చేయవచ్చని ఆయన నిరూపించారు. ప్రతి ఏడాది మే 14న ఆయన జన్మదినాన్ని టెక్నాలజీ రంగానికి చెందినవారు ప్రత్యేకంగా గుర్తు చేసుకుంటూ ఆయన సేవలను స్మరించుకుంటున్నారు.



# అమెరికా తొలి రోదసీ కేంద్రం స్కైలాబ్ ప్రయోగం

అంతరిక్ష పరిశోధనా చరిత్రలో అమెరికా అగ్రరాజ్యంగా ఎదగడానికి దోహదపడిన కీలక ఘట్టం స్కైలాబ్ ప్రయోగం. 1973 మే 14వ తేదీన నాసా తన మొట్టమొదటి అంతరిక్ష కేంద్రాన్ని విజయవంతంగా నింగిలోకి పంపింది. మానవ సహిత అంతరిక్ష యాత్రలకు, సుదీర్ఘకాలం రోదసీలో నివసించే అవకాశాలకు ఈ ప్రయోగం ఒక పునాదిగా నిలిచింది. శాస్త్రవేత్తలు అంతరిక్షంలో ఉండి ప్రయోగాలు చేసేలా భూమి చుట్టూ తిరిగే ఒక ప్రయోగశాలను నిర్మించడం అప్పట్లో ఒక సంచలనం. దీని ద్వారా విశ్వం గురించి అనేక రహస్యాలను తెలుసుకునే అవకాశం కలిగింది. ఈ ప్రయోగం అపోలో మిషన్ల తర్వాత నాసా చేపట్టిన అతిపెద్ద ప్రాజెక్టుగా చరిత్రలో నిలిచిపోయింది. సాటర్న్5 రాకెట్ ద్వారా ప్రయోగించిన ఈ కేంద్రం సుమారు 77 టన్నుల బరువుతో రోదసీలోకి దూసుకెళ్లింది. ప్రయోగ సమయంలో కొన్ని సాంకేతిక లోపాలు తలెత్తినప్పటికీ, శాస్త్రవేత్తల కృషి వల్ల ఆ తర్వాత పంపిన వ్యోమగాములు వాటిని సరిదిద్దారు. స్కైలాబ్ తన ప్రయాణంలో మూడు విభిన్న వ్యోమగాముల బృందాలకు ఆతిథ్యం ఇచ్చింది. వారు వందల గంటల పాటు రోదసీలో గడుపుతూ వైద్యం, భౌతిక శాస్త్రం, సౌర పరిశీలనలపై పరిశోధనలు సాగించారు. సున్నా గురుత్వాకర్షణ శక్తిలో వస్తువుల ప్రవర్తన, మొక్కల పెరుగుదల వంటి అంశాలను వారు నిశితంగా గమనించారు. ఈ ప్రయోగాలు భవిష్యత్తులో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం వంటి భారీ ప్రాజెక్టులకు మార్గదర్శకంగా నిలిచాయి. మానవ మేధస్సు పరిధులు దాటి అనంత విశ్వంలోకి అడుగుపెట్టడానికి ఈ కేంద్రం ఒక ప్రవేశ ద్వారంలా పనిచేసింది. సాంకేతికపరంగా చూస్తే స్కైలాబ్ అప్పట్లో ఒక అద్భుతం. భారీ పరిమాణంలో ఉండే ఈ కేంద్రంలో నివసించడానికి, ప్రయోగాలు చేయడానికి అవసరమైన అన్ని సదుపాయాలు ఉండేవి. సూర్యరశ్మి ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేసే పలకలు, అత్యాధునిక టెలిస్కోపులు దీనిలో అమర్చారు. కక్ష్యలో తిరుగుతున్న సమయంలో భూమిపై ఉన్న కంట్రోల్ రూమ్ నుండి నిరంతరం పర్యవేక్షణ సాగేది. గ్రహాంతర ప్రయాణాలకు కావలసిన మానసిక, శారీరక సామర్థ్యాన్ని అంచనా వేయడానికి ఈ మిషన్ చాలా కీలకమైన డేటాను అందించింది.

చరిత్రలో ఈ ప్రయోగానికి ఉన్న ప్రాముఖ్యతను గుర్తించడం నేటి తరానికి ఎంతో అవసరం. కేవలం రాకెట్లను పంపడమే కాకుండా, రోదసీలో ఒక ఇంటిని నిర్మించుకోవడం అనే కల స్కైలాబ్ ద్వారా సాకారమైంది. ఇది కేవలం అమెరికా సాధించిన విజయం మాత్రమే కాదు, మానవ జాతి మొత్తం గర్వించదగ్గ ఘట్టం. వివిధ దేశాల శాస్త్రవేత్తలు దీని నుండి సేకరించిన సమాచారాన్ని ఉపయోగించుకుని నేడు మరిన్ని అద్భుతాలు సృష్టిస్తున్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో మనం సాధించిన ఈ పురోగతి వెనుక ఎందరో పరిశోధకుల త్యాగం, నిరంతర శ్రమ దాగి ఉన్నాయి. స్కైలాబ్ తన సేవలను ముగించి భూ వాతావరణంలోకి ప్రవేశించినప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. చివరకు 1979లో ఇది హిందూ మహాసముద్రం, ఆస్ట్రేలియా సమీపంలో కూలిపోయింది. అయినప్పటికీ, అది అందించిన జ్ఞానం మాత్రం శాశ్వతంగా నిలిచిపోయింది. నేడు మనం చూస్తున్న ఉపగ్రహ సాంకేతికత, అంతరిక్ష యాత్రల వెనుక స్కైలాబ్ నేర్పిన పాఠాలు ఎన్నో ఉన్నాయి. విజ్ఞాన శాస్త్రం ఎప్పుడూ ఒక క్రమం ప్రకారం అభివృద్ధి చెందుతుందని, పాత ప్రయోగాలు కొత్త ఆవిష్కరణలకు దారి చూపుతాయని దీని ద్వారా స్పష్టమవుతోంది. ప్రస్తుతం ప్రైవేట్ సంస్థలు కూడా అంతరిక్ష యాత్రలు చేస్తున్న తరుణంలో, స్కైలాబ్ వంటి ప్రారంభ కాలపు ప్రయోగాలు ఒక పాఠ్యపుస్తకంలా ఉపయోగపడతాయి. పరిమిత వనరులతోనే అంతటి భారీ కేంద్రాన్ని నిర్వహించడం నేటి ఇంజనీర్లకు ఒక స్ఫూర్తి. విశ్వంలోని నక్షత్రాలు, గ్రహాల గురించి మరింత లోతుగా అధ్యయనం చేయడానికి ఇది పునాది వేసింది. అంతరిక్ష పర్యాటకం గురించి మాట్లాడుకుంటున్న ఈ రోజుల్లో, దానికి బీజం పడింది ఇక్కడేనని మనం గుర్తుంచుకోవాలి. మానవ ఆశయాలకు ఆకాశమే హద్దు అని ఈ మిషన్ నిరూపించింది. స్కైలాబ్ ప్రయోగం జరిగి దశాబ్దాలు గడిచినా దాని ప్రాముఖ్యత ఏమాత్రం తగ్గలేదు. శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ కొత్త సవాళ్లు ఎదురవుతూనే ఉంటాయి, కానీ వాటిని అధిగమించే ధైర్యాన్ని ఇలాంటి చారిత్రక విజయాలు అందిస్తాయి. నేటి యువత అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవడానికి ఇటువంటి విశేషాలు ఎంతో తోడ్పడతాయి. భవిష్యత్తులో మనం ఇతర గ్రహాలపై స్థావరాలు నిర్మించుకోవాలన్నా, ఆ పునాది రాయి స్కైలాబ్ రూపంలోనే పడిందని చెప్పక తప్పదు. ఈ అద్భుత ప్రయోగాన్ని స్మరించుకోవడం మనందరి బాధ్యత.

# ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

ప్రస్తుత ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా కృత్రిమ మేధ ఒక శక్తివంతమైన సాంకేతిక విప్లవంగా అవతరించింది. మానవ మేధస్సుతో సంబంధం ఉన్న పనులను యంత్రాలు అత్యంత వేగంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయడం దీని ప్రత్యేకత. సమాచార సాంకేతికత నుండి వైద్యం, విద్య, రవాణా రంగాల వరకు దీని విస్తృతి రోజురోజుకూ పెరుగుతోంది. ఈ మార్పు మనిషి జీవనశైలిని సులభతరం చేయడమే కాకుండా, పారిశ్రామిక రంగంలో ఉత్పాదకతను భారీగా పెంచుతోంది. ఈ వేగవంతమైన వృద్ధి ఉపాధి రంగంలో పెను మార్పులకు కారణమవుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఉపాధి అవకాశాల పరంగా చూస్తే కృత్రిమ మేధ వల్ల కొన్ని రకాల ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉన్న మాట వాస్తవం. ముఖ్యంగా పునరావృతమయ్యే పనులు, డేటా ఎంట్రీ, సాధారణ విశ్లేషణలు చేసే విభాగాల్లో యంత్రాల వినియోగం పెరగడం వల్ల మానవ వనరుల అవసరం తగ్గుతోంది. తయారీ రంగంలో రోబోల వినియోగం పెరగడం వల్ల కార్మికుల ఉపాధిపై ప్రభావం పడుతోంది. ఇదే సమయంలో సరికొత్త ఉద్యోగ విభాగాలు కూడా పుట్టుకొస్తున్నాయి. ఏఐ ఇంజనీర్లు, డేటా సైంటిస్టులు, మెషిన్ లెర్నింగ్ నిపుణులకు ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన డిమాండ్ పెరుగుతోంది. పాత తరం ఉద్యోగాలు కనుమరుగవుతున్నప్పటికీ, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కొత్త అవకాశాలు తలుపు తడుతున్నాయి. సవాళ్లను ఎదుర్కోవడంలో భాగంగా నైపుణ్యాల పెంపుదల లేదా రీస్కిల్లింగ్ అనేది అత్యంత కీలకమైన అంశం. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యోగులు తమ పనితీరును మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉంది. కేవలం సాంకేతిక విద్య మాత్రమే కాకుండా, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సామాజిక స్పృహ వంటి అంశాల్లో మనిషికి ఉన్న ప్రాధాన్యతను యంత్రాలు భర్తీ చేయలేవు. విద్యా వ్యవస్థలో కూడా సమూల మార్పులు రావాలి. ప్రాథమిక స్థాయి నుండి కృత్రిమ మేధపై అవగాహన కల్పించడం వల్ల భవిష్యత్తు తరాలు ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంటాయి. శిక్షణ సంస్థలు ప్రభుత్వం సమన్వయంతో కొత్త కోర్సులను అందుబాటులోకి తీసుకురావాలి. కృత్రిమ మేధను మనిషికి శత్రువుగా కాకుండా ఒక సహాయకారిగా చూడటం ఉత్తమమైన మార్గం. క్లిష్టమైన పనులను యంత్రాలకు అప్పగించి, మనిషి తన మేధస్సును మరింత ఉన్నతమైన ఆవిష్కరణల కోసం ఉపయోగించుకోవచ్చు. దీనివల్ల పని నాణ్యత పెరగడమే కాకుండా తక్కువ సమయంలో ఎక్కువ ఫలితాలు సాధించవచ్చు. పారిశ్రామిక వేత్తలు తమ లాభాలతో పాటు కార్మికుల భద్రతను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. సాంకేతికత వల్ల వచ్చే లాభాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందేలా చూడటం ప్రభుత్వాల బాధ్యత. సామాజిక సమతుల్యత దెబ్బతినకుండా చట్టాలను రూపొందించడం ద్వారా ఈ విప్లవాన్ని విజయవంతంగా మలుచుకోవచ్చు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# పెట్రోల్ ధరలపై ఆర్‌బీఐ హెచ్చరిక

పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశముందని భారత రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా హెచ్చరించారు. యుద్ధ వాతావరణం మరికొంత కాలం కొనసాగితే దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం తప్పదని ఆయన పేర్కొన్నారు. స్విట్జర్లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ, ఆ భారాన్ని ప్రభుత్వం మరియు ప్రభుత్వ రంగ చమురు సంస్థలే భరిస్తున్నాయని తెలిపారు. అయితే ఈ పరిస్థితిని ఎక్కువకాలం కొనసాగించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికే ఇంధనంపై ఎక్సైజ్ సుంకాలను తగ్గించిందని, చమురు సంస్థలు కూడా నష్టాలను భరిస్తూ వినియోగదారులపై భారం తగ్గించే ప్రయత్నం చేస్తున్నాయని




తెలిపారు. కానీ పశ్చిమాసియా ఉద్రిక్తతలు మరింత పెరిగితే ఇంధన ధరల పెరుగుదలను అడ్డుకోవడం కష్టమవుతుందని హెచ్చరించారు. మరోవైపు దేశ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు పొదుపు పాటించాలని సూచించారు. పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించుకోవాలని, అనవసర ఖర్చులను నియంత్రించాలని కోరారు. ముఖ్యంగా బంగారం కొనుగోళ్లను తగ్గించడం ద్వారా విదేశీ మారక ద్రవ్య నిల్వలను కాపాడుకోవచ్చని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే బంగారంపై దిగుమతి సుంకాలను కేంద్ర ప్రభుత్వం పెంచిన విషయం తెలిసిందే. దేశంలో ద్రవ్యోల్బణం కూడా క్రమంగా పెరుగుతోంది. ఏప్రిల్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.48 శాతానికి చేరుకోగా, మార్చిలో ఇది 3.40 శాతంగా నమోదైంది. యుద్ధ ప్రభావంతో సరఫరా వ్యవస్థ దెబ్బతినడం, రవాణా వ్యయాలు పెరగడం వల్ల రానున్న నెలల్లో ధరల భారము మరింత పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత వృద్ధి రేటును ఆర్‌బీఐ 6.9 శాతంగా అంచనా వేసింది. ద్రవ్యోల్బణం సగటున 4.6 శాతం వద్ద ఉండొచ్చని భావిస్తోంది. అంతర్జాతీయ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైతే కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు.

# ఐస్‌క్రీమ్ రంగంలోకి వంతారా

జంతు సంక్షేమం, వన్యప్రాణుల సంరక్షణకు గుర్తింపు పొందిన రిలయన్స్ ఫౌండేషన్‌కు చెందిన 'వంతారా' ఇప్పుడు కొత్త వ్యాపార రంగంలోకి అడుగు పెట్టింది. ముంబైలోని జియో వరల్డ్ డ్రైవ్‌లో 'వంతారా క్రీమరీ' పేరుతో ప్రత్యేక ఐస్‌క్రీమ్ కేంద్రాన్ని ప్రారంభించి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ కొత్త ప్రారంభం సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చకు దారితీసింది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో వన్యప్రాణుల సంరక్షణ కోసం అనంత్ అంబానీ ఆధ్వర్యంలో ప్రారంభమైన 'వంతారా' ప్రాజెక్ట్ ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఇప్పుడు అదే పేరుతో ఆహార రంగంలోకి ప్రవేశించడం ఆసక్తికరంగా మారింది. చేతితో తయారుచేసే ప్రత్యేక ఐస్‌క్రీమ్‌లు, తక్కువ పరిమాణంలో నాణ్యతను కాపాడుతూ తయారీ చేయడం ఈ బ్రాండ్ ప్రత్యేకతగా చెబుతున్నారు. ఈ



కొత్త వ్యాపారాన్ని ప్రకటిస్తూ వంతారా తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాలో ఒక కృత్రిమ మేధస్సు ఆధారిత ప్రకటన చిత్రాన్ని విడుదల చేసింది. ముంబై రద్దీ వీధుల్లో 'వంతారా క్రీమరీ' వాహనం పరిగెడుతుండగా, దాని వెంట ఒక పులి పరుగెత్తుతూ కనిపించే ఆ దృశ్యాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. వన్యప్రాణుల గుర్తింపును కొత్త వ్యాపార ఆలోచనతో మేళవించే ప్రయత్నంగా దీనిని భావిస్తున్నారు. వంతారా క్రీమరీలో మొత్తం 17 రకాల ఐస్‌క్రీమ్ రుచులు అందుబాటులోకి తీసుకొచ్చారు. భారతీయ రుచులను దృష్టిలో పెట్టుకుని ఫిల్టర్ కాఫీ, నిమ్మరసం సోర్బెట్, జామమిరపపొడి, మలై కుల్ఫీ వంటి ప్రత్యేక రుచులను రూపొందించినట్లు కంపెనీ తెలిపింది. ప్రారంభమైన కొద్ది గంటల్లోనే ఈ బ్రాండ్ సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా ట్రెండ్ అయింది. జామ్‌నగర్‌లో 3,500 ఎకరాల్లో విస్తరించిన వంతారా ప్రాజెక్ట్ జంతు రక్షణ, సంరక్షణ, పునరావాస కార్యక్రమాలకు కేంద్రంగా నిలిచింది. 2024లో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు ఐస్‌క్రీమ్ రంగంలోకి ప్రవేశించడం ద్వారా యువ వినియోగదారులను ఆకర్షించడమే కాకుండా, తన బ్రాండ్ విస్తరణకు కొత్త దిశలో అడుగులు వేస్తోందని ఆహార, బ్రాండింగ్ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## amazon BAZAAR

# తెలుగు రాష్ట్రాల్లో అమేజాన్ బజార్ దూకుడు

భారత ఈ-కామర్స్ రంగంలో ప్రముఖ సంస్థ [అమేజాన్ ఇండియా] చెందిన 'అమేజాన్ బజార్' తెలుగు రాష్ట్రాల్లో వేగంగా విస్తరిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో గత ఏడాదితో పోలిస్తే ఆర్డర్ల సంఖ్య నాలుగు రెట్లు పెరగడం విశేషంగా మారింది.
ముఖ్యంగా హైదరాబాద్ నగరం ఈ వృద్ధికి కేంద్రంగా నిలవగా, విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, వరంగల్ నగరాలు కూడా మంచి వృద్ధిని నమోదు చేశాయి. 2026 ప్రారంభ నెలల్లోనే హైదరాబాద్‌లో ఆర్డర్లు ఆరు రెట్లు పెరిగినట్లు సంస్థ వెల్లడించింది.
బడ్జెట్ వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని రూ.99 నుంచే ఉత్పత్తులు అందుబాటులో ఉంచడం, ఉచిత డెలివరీ వంటి సౌకర్యాలు వినియోగదారులను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా తక్కువ ధరల్లో ఫ్యాషన్, గృహోపకరణాలు, మొబైల్ యాక్ససరీస్ లభించడం వల్ల చిన్న పట్టణాల్లో కూడా ఆన్‌లైన్ కొనుగోళ్లు గణనీయంగా పెరుగుతున్నాయి.
అమేజాన్ బజార్‌లో మహిళల ఫ్యాషన్ విభాగం అత్యధిక ఆదరణ పొందుతోంది. చీరలు, కుర్తాలు, ఫ్యాషన్ నగల కొనుగోళ్లు భారీగా పెరగడంతో ఈ విభాగం ఆరు రెట్ల వృద్ధిని నమోదు చేసింది. అదే సమయంలో గృహ, వంటగది ఉత్పత్తుల విభాగం ఎనిమిది రెట్లు పెరిగి అత్యధిక వృద్ధిని సాధించింది. ఇంటి అలంకరణ వస్తువులు, కిచెన్ సామగ్రికి భారీ డిమాండ్ కనిపిస్తోంది. ఇక మొబైల్ కవర్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాల విక్రయాలతో ఎలక్ట్రానిక్ యాక్ససరీస్ విభాగం నాలుగు రెట్లు పెరిగింది.
టియర్-2, టియర్-3 పట్టణాల్లో వినియోగదారుల కొనుగోలు ధోరణిలో వచ్చిన మార్పులే ఈ వృద్ధికి ప్రధాన కారణమని అమేజాన్ బజార్ విభాగాధిపతి సమీర్ లాల్వాని తెలిపారు. గ్రామీణ, చిన్న పట్టణ ప్రాంతాల్లో కూడా ఆన్‌లైన్ షాపింగ్‌పై ఆసక్తి పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు.
అమేజాన్ బజార్ ద్వారా స్థానిక వ్యాపారులకు కూడా మంచి అవకాశాలు లభిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 75 వేల మందికి పైగా విక్రేతలు ఉండగా, వారిలో 1,200 మందికి పైగా అమేజాన్ బజార్ వేదికగా తమ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. విక్రేతల సంఖ్య 2.4 రెట్లు పెరగడంతో పాటు, వినియోగదారులకు అందుబాటులో ఉన్న ఉత్పత్తుల ఎంపిక కూడా 2.5 రెట్లు విస్తరించింది.
డెలివరీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు అమేజాన్ తెలుగు రాష్ట్రాల్లో ఎనిమిది ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాలు, మూడు సార్టేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. రాబోయే రోజుల్లో మరిన్ని చిన్న పట్టణాలకు సేవలను విస్తరించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.




# కొత్త ఏడు సీట్ల వాహనం విడుదల

జపాన్‌కు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ నిస్సాన్ భారత మార్కెట్లో కొత్త ఏడు సీట్ల క్రీడా వినియోగ వాహనం 'గ్రావైట్'ను ప్రవేశపెట్టి వినియోగదారుల దృష్టిని ఆకర్షిస్తోంది. కుటుంబ అవసరాలు, సుదూర ప్రయాణాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ వాహనం తక్కువ ధరకే ఆధునిక సౌకర్యాలను అందించనున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. ప్రారంభ ఎక్స్ షోరూమ్ ధర రూ.5.65 లక్షల నుంచి ఉండొచ్చని సమాచారం. కొత్త గ్రావైట్ వాహనం ఆకర్షణీయమైన రూపకల్పనతో యువతను ఆకట్టుకుం టోంది. ముందుభాగంలో భారీ గ్రిల్, ఎల్ఈడీ పగటి వెలుగుల దీపాలు, స్పోర్టీ నమూనా ఈ వాహనానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. వాహనం లోపల ఏడు మందికి సౌకర్యవంతమైన సీటింగ్ ఏర్పాటు చేశారు. పెద్ద టచ్‌స్క్రీన్ వినోద వ్యవస్థ, డిజిటల్ మీటర్ ప్యానల్, వైర్‌లెస్ కనెక్టివిటీ, ఆటోమేటిక్ ఉష్ణోగ్రత నియంత్రణ వంటి ఆధునిక సౌకర్యాలు ఇందులో అందుబాటులో ఉన్నాయి. ఇంజన్ విభాగంలో ఒక లీటర్ టర్బో పెట్రోల్ ఇంజన్‌ను అందించనున్నట్లు తెలుస్తోంది. ఇది మంచి మైలేజీతో పాటు శక్తివంతమైన పనితీరును అందిస్తుందని కంపెనీ పేర్కొంది. మాన్యువల్, ఆటోమేటిక్ గేర్‌బాక్స్ ఎంపికలు ఉండటంతో నగర ప్రయాణాలు, జాతీయ రహదారులపై ప్రయాణాలకు కూడా అనుకూలంగా ఉంటుంది. భద్రతా అంశాల విషయంలో కూడా కంపెనీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. బహుళ గాలి సంచులు, యాంటీ లాక్ బ్రేకింగ్ వ్యవస్థ, ఎలక్ట్రానిక్ బ్రేక్ పంపిణీ వ్యవస్థ, వెనుక పార్కింగ్ కెమెరా వంటి భద్రతా సౌకర్యాలు ఇందులో ఉన్నాయి. భారత మార్కెట్లో ఈ వాహనం రెనాల్ట్ ట్రైబర్, మారుతి ఎర్టిగా, కియా కేరెన్స్ వంటి వాహనాలకు పోటీగా నిలవనుంది. తక్కువ ధరలో ఏడు సీట్ల వాహనం కోసం ఎదురు చూస్తున్న మధ్యతరగతి కుటుంబాలకు ఇది మంచి ఎంపికగా మారొచ్చని ఆటో రంగ నిపుణులు అభిప్రాయపడు తున్నారు. దేశంలో క్రీడా వినియోగ వాహనాలు, బహుళ ప్రయోజన వాహనాల డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో నిస్సాన్ ఈ కొత్త మోడల్‌ను తీసుకొచ్చింది. బుకింగ్, డెలివరీ వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# చిరు న్యూ లుక్ వైరల్

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి వయసు పెరుగుతున్న కొద్దీ మరింత యంగ్‌గా కనిపిస్తూ అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నారు. 70 ఏళ్ల వయసులోనూ అదే ఉత్సాహం, అదే స్టైల్‌తో కుర్ర హీరోలకు గట్టి పోటీ ఇస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి విడుదలైన ఆయన చిత్రం భారీ విజయాన్ని అందుకుని బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపింది. దాదాపు రూ.400 కోట్ల వసూళ్లు సాధించి చిరంజీవి మరోసారి తన స్టార్‌డమ్‌ను నిరూపించుకున్నారు. ప్రస్తుతం దర్శకుడు కేఎస్ రవీంద్ర తెరకెక్కిస్తున్న సినిమాలో చిరంజీవి నటిస్తున్నారు. ఈ చిత్రం కోసం ఆయన పూర్తిగా కొత్త మేకోవర్‌లో కనిపించనున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాజాగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. లేత తెలుపు రంగు పోలో షర్ట్‌లో చిరంజీవి ఎంతో స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. స్లిమ్ ఫిట్ లుక్, యంగ్ స్టైల్‌తో ఆయన తన వయసులో సగం ఉన్నట్లుగా కనిపిస్తూ అభిమానులను ఫిదా చేస్తున్నారు. ఈ ఫోటోలు చూసిన నెటిజన్లు “చిరంజీవి వయసు రివర్స్‌లో వెళ్తుందా?” అంటూ కామెంట్లు చేస్తున్నారు.



# పేరు దుర్వినియోగంపై నాగార్జున కోర్టుకు

టాలీవుడ్ సీనియర్ నటుడు నాగార్జున తన వ్యక్తిగత హక్కులకు భంగం కలుగుతోందని ఆరోపిస్తూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన అనుమతి లేకుండా పేరు, ఫొటోలను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారని పేర్కొంటూ ఆయన పిటిషన్ దాఖలు చేశారు. ముఖ్యంగా ఓ దుస్తుల వ్యాపారి తన చిత్రాలు, పేరుతో టీషర్టులను విక్రయిస్తున్నాడని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

ఈ కేసుపై విచారణ చేపట్టిన ఢిల్లీ హైకోర్టు సంబంధిత వ్యాపారిపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. “నాగార్జున పేరు, ఫొటోలను ఉపయోగించి టీషర్టులు విక్రయించే హక్కు మీకు ఎవరు ఇచ్చారు?” అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. వ్యక్తిగత అనుమతి లేకుండా ప్రముఖుల పేర్లను వాణిజ్యపరంగా వినియోగించడం ఎంతవరకు సమంజసమని నిలదీసింది. వ్యాపారి తరఫున న్యాయవాది శృతి అయ్యర్ వాదనలు వినిపిస్తూ, ‘ది ఘోస్ట్’ సినిమా కోసం తమ సంస్థ అధికారిక ప్రచార భాగస్వామిగా పనిచేసిందని తెలిపారు. ఓ మార్కెటింగ్ సంస్థ ద్వారా నిర్మాణ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామని, ఆ సమయంలో నాగార్జున కూడా సంబంధిత వస్తువులను ప్రచారం చేశారని కోర్టుకు వివరించారు. ఈ కారణంగా తమపై నమోదైన కేసు నుంచి మినహాయింపు ఇవ్వాలని అభ్యర్థించారు.అయితే నాగార్జున తరఫు న్యాయవాది ఈ వాదనలను తీవ్రంగా ఖండించారు. సంబంధిత ఒప్పంద పత్రాలు సమర్పించాలని పలుమార్లు కోరినా పూర్తి వివరాలు ఇవ్వలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కోర్టుకు సమర్పించిన ఈమెయిల్ పత్రాలు కూడా అసంపూర్ణంగా ఉన్నాయని తెలిపారు. చివరికి వ్యాపారి తరఫు న్యాయవాది, నాగార్జునతో గానీ లేదా సంబంధిత నిర్మాణ సంస్థతో గానీ తమకు ఎటువంటి ప్రత్యక్ష ఒప్పందం లేదని అంగీకరించారు. దీంతో ధర్మాసనం మరింత సీరియస్ అయింది. “ప్రత్యక్ష ఒప్పందం లేదని మీరే చెబుతున్నప్పుడు, ఈ వస్తువులను విక్రయించే చట్టబద్ధ హక్కు ఎక్కడి నుంచి వచ్చింది?” అంటూ ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై తదుపరి విచారణను ఆగస్టు 3కు వాయిదా వేస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# ఓటీటీలోకి ‘అవతార్’ మూడో భాగం




ప్రపంచ సినీ ప్రేమికులను అద్భుతమైన దృశ్యాలతో మంత్ర ముగ్ధులను చేసిన ‘అవతార్’ సిరీస్‌కు ప్రత్యేక స్థానం ఉంది. దర్శకుడు జేమ్స్ కామెరూన్ రూపొందించిన ఈ ఫాంటసీ ప్రపంచం ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకుంది. ప్రతి భాగం సాంకేతికంగా కొత్త ప్రమాణాలు సృష్టిస్తూ హాలీవుడ్ సినిమాల స్థాయిని మరింత ఎత్తుకు తీసుకెళ్లింది.

ముఖ్యంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ సినిమాకు భారీ స్పందన లభించింది. థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమైన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమవుతోంది. ప్రముఖ ఓటీటీ వేదిక డిస్నీ ప్లస్ ద్వారా జూన్ 24 నుంచి ఈ చిత్రం ప్రసారం కానున్నట్లు సమాచారం. దీంతో అవతార్ అభిమానులు మరోసారి పండోరా ప్రపంచాన్ని ఇంటి వద్ద నుంచే ఆస్వాదించే అవకాశం పొందనున్నారు.



# కేన్స్‌లో అలియా మెరుపులు

ప్రపంచ సినీ, ఫ్యాషన్ అభిమానుల దృష్టిని ఆకర్షించే ప్రతిష్ఠాత్మక కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఫ్రాన్స్‌లోని ఫ్రెంచ్ రివియేరా వేదికగా జరిగిన ఈ వేడుకలో ఉదయం నుంచే కలల ప్రపంచాన్ని తలపించే అందంతో కనిపించిన అలియా.. సాయంత్రం రెడ్ కార్పెట్‌పై మరింత గ్లామరస్‌గా మెరిసి అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించారు. లోరియల్ పారిస్ బ్రాండ్ అంబాసిడర్‌గా కేన్స్ రెడ్ కార్పెట్‌పై అడుగుపెట్టిన అలియా.. ప్రముఖ డిజైనర్ తమారా రాల్ఫ్ రూపొందించిన ప్రత్యేక గౌన్‌లో కనిపించారు. లేత గులాబీ రంగులో రూపొందించిన ఈ స్ట్రాప్‌లెస్ గౌన్ ఆమెకు అద్భుతమైన ఆకర్షణను తీసుకొచ్చింది. ఈ గౌన్‌లో ప్రత్యేకంగా రూపొందించిన నెక్‌లైన్, కార్సెట్ శైలిలో ఉన్న బాడిస్ ఆమె ఫిట్‌నెస్‌ను మరింత హైలైట్ చేశాయి. అలాగే చేతుల చుట్టూ దుపట్టా తరహాలో అమర్చిన డ్రేప్ మొత్తం లుక్‌కు భారతీయ శైలిని జోడించింది. పాశ్చాత్య ఫ్యాషన్‌లో భారతీయతను మేళవించిన ఈ డిజైన్ ఫ్యాషన్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది.

అలియా మినిమల్ ఆభరణాలు, సాఫ్ట్ మేకప్, సాధారణ హెయిర్ స్టైల్‌తో ఎంతో రాయల్‌గా కనిపించారు. ఆమె చిరునవ్వు, ఆత్మవిశ్వాసం మొత్తం లుక్‌ను మరింత ప్రత్యేకంగా మార్చాయి. ప్రస్తుతం కేన్స్‌లో అలియా చేసిన ఈ స్టైల్ స్టేట్‌మెంట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అభిమానులతో పాటు ఫ్యాషన్ విమర్శకులు కూడా అలియా లుక్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు. భారతీయ సాంప్రదాయాన్ని ఆధునిక ఫ్యాషన్‌తో మేళవిస్తూ అలియా మరోసారి గ్లోబల్ ఫ్యాషన్ ఐకాన్‌గా తన స్థాయిని నిరూపించుకున్నారని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా కేన్స్ వేదికపై భారతీయ నటీమణులు తమ ప్రత్యేక ఫ్యాషన్ స్టైల్స్‌తో ఆకట్టుకుంటుండగా.. ఈసారి అలియా భట్ తన సొగసైన రెడ్ కార్పెట్ లుక్‌తో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ప్రస్తుతం ఆమె ఫోటోలు నెట్టింట విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in